కథా నిలయం
శ్రీకాకుళం



# భార్య వేశ్య కాదు

వసుంధర

నా పుట్టిన రోజింక సరిగ్గా నాలుగు రోజులుంది. ఆయన ఇంత వరకూ కొత్త చీర కొనలేదు. జాకెట్ గురించి నా కిబ్బంది లేదు. ఇంట్లో మిషన్ ఉంది. రాత్రికి రాత్రి కుట్టేయగలను.

వారం రోజుల్నుంచి ప్రయత్నిస్తున్నాను ఆయనకు గుర్తు చేద్దామని! వారం రోజుల్నించీ ఆయన ఆఫీసు నుంచి ఇంటికి లేటుగా

వస్తున్నారు. ఈ రోజూ అలాగే చేశారు.

ఉదయమప్పుడు అడిగితే సరే అంటున్నారు. అదీకాక అప్పుడుహడావుడి. టిఫిన్ చేయాలి. కాఫీ కలపాలి. వంట చేయాలి. ఆయనకు క్యారియర్ సర్దాలి. పిల్లల్ని తెమిల్చి స్కూలుకు పంపాలి. సాయంత్రం అడుగుదామంటే ఆయన ఆలస్యంగా రావడం వల్ల కుదరడం లేదు. అన్నీ సర్దుకుని పడుకునేసరికి అలసట వల్ల వెంటనే నిద్ర పట్టేస్తోంది. ఏ రాత్రో మెలకువలో దరిజేరినా అప్పుడీ ధ్యాసే ఉండడం లేదు.

అయినా మరీ ఇంత పీకెల మీదకు వస్తుందనుకోలేదు. చూస్తూండగా రోజులు గడిచి పోతున్నాయి. ఆయనలో చలనం ఉండడంలేదు.

నేనెప్పుడూ తిథుల ప్రకారమే నా పుట్టిన రోజు జరుపుకుంటాను. ఈసారి అది నెలాఖర్లోకి వచ్చింది. ఈ నెల ఆరంభంలో అనుకోకుండా వారు ఇంటికి కాస్త ఎక్కువ డబ్బు పంపాల్సి వచ్చింది. పిల్లల స్కూళ్ళలో ఏదో డొనేషన్ అంటూ ఇద్దరికీ కలిపి యాభై రూపాయలు వదిల్చేశారు. గత మాసం కరెంట్ బిల్లు ఏ కారణం వల్లనో రాలేదు. రెండు నెలలదీ కలిపి ఈ నెల వసూలయింది. ఇందులో ఓ ప్రాణ మిత్రుడికి డెబ్భై రూపాయలు అప్పు కూడా ఇచ్చారాయన. వీటన్నింటికీ తోడు మా ఎదురింటావిడ తన పుట్టిన రోజుకో చీర కొనుక్కుంది. దాని ఖరీదు రెండొందల అయిదు. అందువల్ల నేను అంతకంటే కాస్త ఎక్కువే పెట్టాలి. ఇంతవరకూ నా చీర ఏదీ ఆవిడ చీర ఖరీదుకు తక్కువకాదు. అయినా ఆవిడ సాధారణంగా వందలోపు చీరలే కడుతుంది. నా దురదృష్టం కొద్దీ ఈ సారి కాస్త ఖరీదైన చీరకొంది.

ఇంట్లో నా దగ్గర ఎనభై రూపాయలున్నాయి. ఆయన దగ్గరున్నది కూడా వందకు మించదు. అందువల్లే చీర గురించి ఇంత ఆలోచించాల్సి వచ్చింది. ఆయన ఎవరి దగ్గరైనా అప్పు పుట్టించాలి. ఈ రోజు ఆయన ఇంటికి రాగానే అన్ని విషయాలూ పక్కకు నెట్టి చీర విషయమే మాట్లాడాలనుకున్నాను. అందుకే ఆయన ఇంకా బూట్లు విప్పకుండానే-"ఏమండీ! నా పుట్టిన రోజు సంగతి తేల్చడం లేదు మీరు!" అనేశాను.

"ఇంటికి రాగానే వేరే టాపిక్ దొరకదా నీకు?" అన్నారాయన

విసుగ్గా నావైపు చూస్తూ.

"టాపిక్ మార్చాలని నాకూ సరదాగానే ఉంది. మీరే తీర్చడం లేదు" అన్నాను.

"బియ్యే ప్యాసయ్యావుగదా, తెలివి తేటలుంటాయనుకుని మోస పోయాను. చీరల పేరుతో మొగుణ్ణి వేధించడంలో రెండో క్లాసు చదివిన మా అమ్మా, బియ్యే ప్యాసైన నువ్వూ ఒక్కలాగే ఉన్నారు" అన్నారాయన ఇంకా చిరాగ్గానే.

నా మనసు చివుక్కుమంది. 'చీరల కోసం ఆయన్ను నేను వేధిస్తున్నానా? పుట్టినరోజు నాడు భర్త చేత కొత్త చీర కొనిపించుకోవాలను కోవడం వేధించడమవుతుందా?'

"చీర కావాలంటే వేధించడ మని నాకు తెలియదు. ఇప్పుడు చెప్పారు కాబట్టి ఇంకెప్పుడూ మిమ్మల్ని చీర కావాలని అడగను" అన్నాను.

ఆయనేమీ మాట్లాడలేదు. ఆ మౌనం నా బాధను పెంచింది. నా బాధ కోపంగా కూడా మారింది. ముభావంగా పనులన్నీ ముగించుకున్నాను. పిల్లల్ని పడుకోబెడుతూ వాళ్ళ పక్కనే పడుకుండిపోయాను.

ఓ రాత్రి వేళ ఆయన నన్ను లేపారు. ఉలిక్కిపడి లేచాను. ఆయన్ను చూడగానే త్వరగానే నా కోపం సంగతి గుర్తుకొచ్చింది.

"నాకు నిద్ర వస్తోంది. పడుకో నివ్వండి!" అన్నాడు విసుగ్గా.

"గట్టిగా అరవకు. పిల్లలు లేస్తారు" అన్నారాయన భయంగా.

కుంభకర్ణుణ్ణయినా మధ్యలో లేప వచ్చునేమోగానీ మా పిల్లల్ని మాత్రం మధ్యలో లేపలేము. ఆ సంగతి నాకు బాగా తెలుసు. అందుకే-"మీరు వెళ్ళి పడుకోండి!" అన్నాను మళ్ళీ.

"నీతో మాట్లాడాలి!" అన్నారాయన.

"పొద్దున్న మాట్లాడుకుందాం లెండి!" అన్నాను.

"రమా! ప్లీజ్-నాకు నిద్ర పట్టటం లేదు. నీతో అర్జంటుగా మాట్లాడాలి!"

ఆయన ఏం మాట్లాడాలో నాకు తెలుసు. విననట్లుగా నటించి పడుకోబోయాను.

ఆయన నా చేతులు పట్టుకుని- "ఇవి చేతులు కావు- కాళ్ళు" అన్నారు.

"ఇప్పుడలాగే అంటారు. చీరల పేరు చెప్పి మిమ్మల్ని వేధించే దాన్ని, చదువున్నా సంస్కారం లేని దాన్ని-నాతో మీకెందుకు? నా

మానాక నన్ను పడుకోనివ్వండి" అన్నాను.

"ఓహో! నువ్వింకా ఆ మాటలు మర్చిపోలేదా? రమా! నేనుమూర్ఖుణ్ణి. నీలాంటి దేవతను అలాంటి మాట లెలా అనగలిగానో నాకు తెలియదు. చీరల కోసం నువ్వు వేధించడ మేమిటి? నీకు చీరలు కొనేది నా సంతోషం కోసం. ఆ విషయమై నీతో కొన్ని మాటలు మాట్లాడాలి. ప్లీజ్! వస్తావు కదూ?" అన్నా రాయన.

నేను లేచి ఆయనతో మా గదికి వెళ్ళాను.

ఆయన తన్ను తాను తిట్టు కున్నారు. నన్ను ఆకాశానికెత్తేశారు. రేపు ఆఫీసు మానేసి చీర కోసం అప్పు వేటకు బయల్దేరుతారుట. డబ్బు దొరకగానే ఇద్దరూ షాపిం గ్‌కు తిరగడమేనట!

సమయం అనుకూలంగా ఉండ డంతో ఆయన ప్రవర్తనకు నా మనసెలా గాయపడిందో వివరించి చెప్పాను. అప్పటికప్పుడు ఎన్నో షరతులు విధించాను.

ఆయన తన తప్పులన్నీ ఒప్పే సుకున్నారు. నా షరతులన్నింటికీ అంగీకరించారు. నా మనసుకు ఎంతో సంతోషమైంది. ఆయన దగ్గరగా తీసుకుంటూంటే మనసు పరవశించింది. తనువు పులకరిం చింది.

మర్నాడాయన ఆఫీసుకు వెళ్ళే టప్పుడు, "రమా! ఆఫీసుకు వెళ్ళినా నేను డబ్బుకోసమే ప్రయత్నిస్తాను. డబ్బు దొరకగానే సెలవుపెట్టి ఇంటికి వచ్చేస్తాను" అన్నారు.

నాకు ఎంతో సంతోషమైంది. ఆయన చీర విషయం ఇంకా మరిచిపోలేదు.

మధ్యాహ్నం తీరుబడి సమ యంలో ఒక నవల చదువు తున్నాను. అది ఒక వేశ్య కథ. కథానాయకుడికి భార్య ఉన్నా వేశ్య వలలో పడతాడు. ఒకసారి వేశ్య ముత్యాలహారం కొనుక్కోవాలను కుంటుంది. కథానాయకుడు డబ్బు లేదంటాడు. వేశ్య అతనితో మాట్లాడడం మానేస్తుంది. దరి దాపుల కూడా రానివ్వదు. కథా నాయకుడు తనకున్న ముఖ్యమైన పనులన్నీ వదిలిపెట్టి ఆ విషయమై ప్రయత్నించి ముత్యాలహారం కొని, వేశ్య అభిమానాన్నీ, ప్రాపకాన్నీ మళ్ళీ సంపాదిస్తాడు.

ఇది చదవగానే హఠాత్తుగా నాకూ, ఆ వేశ్యకూ సామ్యముందని స్ఫురించింది నాకు.

'రాత్రి నేను చేసిందేమిటి? ఆయన బలహీన క్షణాన్ని కనిపెట్టి

నాకవసరమైనది చేయడానికి ఒప్పించాను. అంటే ఆయనకూ నాకూ ఉన్న సంబంధం ఏమిటి? పవిత్ర దాంపత్యపు టనుబంధం ఇంతేనా? తన అవసరం కోసమే ఆయన నా కోరికలు తీరుస్తున్నారా? భార్య అన్న ప్రేమాభిమానాలతో ఆయన నా గురించి ఏమీ చేయలేరా?'

నా శరీరం అవమానంతో కుంచించుకుపోయింది. 'రాత్రి నేను వేశ్యగా మారిపోయాను. పుట్టిన రోజుకు ఖరీదయిన చీర కొనిపించుకోవాలనే కోర్కెతో నన్ను నేను ఆయనకు అర్పించుకున్నాను తప్పితే ఒక భార్య భర్తను చేరినట్లుగా చేరలేదు. నా చదువు, సంస్కారం ఆఖరికి నన్నొక వేశ్యగా తీర్చిదిద్దుతున్నాయా?

'ఆయనకు నాపై ఎలాంటి అభిప్రాయం కలిగి ఉంటుంది? కట్టుకున్న భార్య కాబట్టి పైకి ఏమీ అనకపోయినా లోపల్లోపలే నేనంటే చాలా తేలిక భావం కలిగి ఉంటుంది.'

తర్వాత ఇంక నవల చదవలేకపోయాను. మనసు కూడా పాడయింది.

ఐతే ఆరోజు కూడా ఆయన ఇంటికి రోజులాగే లేటుగా వచ్చారు.

"నన్ను క్షమించమని అడగడానికి కూడా సిగ్గుగా ఉంది రమా! ఆఫీసులో అర్జంటు పని ఉంది. బాధ్యతగల ఆఫీసరుగా నీ చీర


# విజయ

## చందా వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | 42 రూ॥ |
| అర్ధసంవత్సర చందా | 21 రూ॥ |
| విడి ప్రతి | 3-50 రూ॥ |

అప్పు చేయడంకోసం సెలవు తీసుకోలేకపోయాను. అన్న ప్రకారం కనీసం పెందరాళేనైనా ఇంటికి రాలేకపోయాను" అన్నారాయన.

ఆయన ఇలా అన్నప్పటికీ రానున్న తుఫాన్‌కి ఎలా తట్టుకోవాలా అన్న కలవరం ఆయన ముఖంలో ప్రతి ఫలిస్తోంది. ఆయన్ను చూస్తే జాలి వేస్తోంది.

"ఎంత మంచి వారండీ మీరు!" అన్నాను అప్రయత్నంగా. ఆ మాటలు నేను మనస్ఫూర్తిగానే అన్నాను. నన్ను వేశ్యగా గుర్తించి భయపడక, భార్యగా గుర్తించి నిర్లక్ష్యంచేసిన ఆయన మంచితనం ఒక్కసారిగా నా మనసును ఎంతో తేలిక చేసింది.

ఆయన నా వంక ఆశ్చర్యంగా చూశారు. నేను వ్యంగ్యంగా మాట్లాడేనని ఆయన అనుమానం. అయితే నా ముఖంలో భావాలలా లేవు. తర్వాతి నా ప్రవర్తన కూడా అలా లేదు.

రాత్రి ఆయన పిలవకుండానే గదిలోకి వెళ్ళాను. నా ప్రవర్తనకు అర్థం తెలియక సతమతమవుతున్న ఆయన మరోసారి నన్ను క్షమార్పణ అడిగారు.

"ఎందుకండీ మాటిమాటికీ క్షమార్పణ అడుగుతారు? మీ ఇబ్బందులు నాకు తెలియవా? నేను మీ అర్ధాంగిని. మీ కష్ట సుఖాలు రెండింటిలోనూ నాకు భాగముంది. ఏ మాత్రం వీలున్నా మీరే చూస్తారు. నేను మిమ్మల్నీ విషయంలో విసిగించి ఉంటే నన్ను క్షమించండి! ఈ పుట్టిన రోజుకు మీరు చీర కొనకపోయినా నేనేమీ అనుకోను. ఇది మనస్ఫూర్తిగా చెబుతున్న మాట" అన్నాను. అయితే నాలోని మార్పుకు కారణమైన ఆ వేశ్య కథ గురించి మాత్రం ఆయనకు చెప్పలేదు.

ఆయన నన్ను ప్రేమగా దగ్గరకు తీసుకున్నారు. ఒక వేశ్యలా కాక భార్యకు వలెనే ఆయన కౌగిలిలో కరిగాను నేను.

ఆ మర్నాడు సాయంత్రం ఆయన డబ్బు సాధించుకు వచ్చారు. మేము షాపింగుకు వెళ్ళాం. పుట్టిన రోజుకు నాకు చీర, జాకెట్టు రెండూ కూడా అమరాయి.

ఇప్పుడు నేను గ్రహించిన దేమిటంటే-పురుషుడికి సంబంధించినంత వరకూ వేశ్యకూ, భార్యకూ చాలా తేడా ఉంది. వేశ్య అందకుండా దూరంగా ఉంటానని బెదిరించి తనక్కావలసినవి సాధిస్తుంది. భార్య తన కేమీ వద్దని త్యాగాన్ని ప్రకటించి కోరినవి సాధిస్తుంది. పద్ధతుల్లో తేడా ఉన్నా వేశ్య బెదిరింపు కయ్యే ఖర్చుకు భార్య త్యాగం చేసే ఖర్చు తీసిపోదు. *